క్లుప్తంగా

80 మందికి నేత్ర వైద్య పరీక్షలు

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తాడువాయిలో పటాన్ మస్తాన్, పఠాన్ బాజీ సహకారంతో ఏర్పాటు చేసిన నేత్ర వైద్య శిబిరాన్ని వైద్యులు రాజు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ శిబిరంలో 80 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా 25 మందికి కళ్లజోళ్లు, 8 మందికి కంటి ఆపరేషన్‌లు అవసరమని గుర్తించినట్లు నేత్ర వైద్యులు లోకేష్ తెలిపారు. కార్యక్రమంలో డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకుడు అమృతాల రంగా, గౌరవ అధ్యక్షుడు నేలపోలు ప్రభాకర్, కార్యదర్శి పఠాన్ బాజీ పాల్గొన్నారు.

34 మంది ఉద్యోగాలకు ఎంపిక

కొయ్యలగూడెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో కొయ్యలగూడెం ప్రకాశం డిగ్రీ కళాశాలలో శుక్రవారం మిని జాబ్ మేళా నిర్వహించారు. 123 మంది యువత హాజరు కాగా వీరిలో 34 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలు సాధించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ తెలియజేశారు. మినీ జాబ్ మేళాకు అరబిందో ఫార్మా, టీమ్ లీస్, ముతూట్ ఫైనాన్స్, తదితర కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న దృశ్యం

లింగపాలెం: ధర్మాజీగూడెం భట్రాజులపేట ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు ఫాదర్ బల్తజార్ ఆర్థిక సాయంతో నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, బాక్స్‌లు పంపిణీ చేశారు. హెచ్ఎం కె గస్పర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఈవో రామారావు చేతుల మీదుగా విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. ఎంఈవో- 2 జంగం రవీంద్ర, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గరికపాటి రాజారావు జయంతి

కామవరపుకోట: ప్రజలను చైతన్య పరచడంలో డాక్టర్ గరికపాటి రాజారావు సిద్ధహస్తులని సాయిన రాఘవమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సాయిన కనకరాజు అన్నారు. డాక్టర్ గరికపాటి రాజారావు 60వ వర్ధంతిని పురస్కరించుకుని సాయిన రాఘవమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కళాకారులను సత్కరించారు. ప్రజానాట్య మండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టీవీఎస్ రాజు నేతృత్వంలో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ బుర్రకథ కళాకారులు ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షుడు సబ్బి కనకారావు, పోతురాజు నాగేశ్వరరావు, మల్లుల సీతారామ ప్రసాద్, దువ్వి హేమసుందర్, లీలా కుమార్, భజంత్రీల శ్రీనివాస్, డి.గోపాలకృష్ణ, యడవల్లి దుర్గాప్రసాద్, బండి సరస్వతి, తానంకి నారాయణలను శాలువాలతో సత్కరించి మొమెంటోలు అందజేశారు. తొలుత గరికపాటి రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వేలేరుపాడులో గ్రామసభ

వేలేరుపాడు: పోలవరం ఆర్అండ్ఆర్ వ్యక్తిగత ప్యాకేజీకి సంబంధించిన గ్రామసభను శుక్రవారం గ్రామ సచివాలయంలో నిర్వహించారు. రేపాకగొమ్ము గ్రామ పంచాయతీ పరిధిలోని వేలేరుపాడు మండల కేంద్రంలో సర్పంచ్ సోయం వెంకమ్మ అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో గ్రీవెన్స్‌లో ఉన్న 58 మంది నిర్వాసితులను విచారించారు. వారి వద్ద ఉన్న ఆధారాలను చెక్‌లిస్ట్ ప్రకారం పరిశీలించారు. వేలేరుపాడు తహసీల్దార్ జీ ఎలీషా, ఆర్ఐ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

పోలవరం రూరల్: రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబు సూచించారు. పోలవరం రైతు భరోసా కేంద్రం వద్ద వ్యవసాయ సలహామండలి చైర్మన్ దత్తి రాంబాబు అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. రైతులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కొత్తూరు చెరువుకు సంబంధించి సప్లయి చానల్, తూములకు సంబంధించి సాగునీరు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను తాళ్లపూడి రైస్‌మిల్లులో ట్యాగింగ్ చేసేలా ఏర్పాటు చేయాలన్నారు.

బాల్య వివాహాలతో అనర్థం

బుట్టాయగూడెం: బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై గిరిజన ప్రాంతంలో విస్తృతంగా అవగాహన కల్పించాలని జెడ్పీటీసీ మొడియం రామతులసి అన్నారు. రాజానగరంలో అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాల నిర్మూలనపై శుక్రవారం సర్పంచ్ కుంజా దుర్గమ్మ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల సామాజిక, ఆరోగ్యపరమైన సమస్యలపై ప్రజల్లో పూర్తి అవగాహన పెంచాలన్నారు.

నూతన పింఛన్‌ల అందజేత

పోలవరం రూరల్: నూతనంగా మంజూరైన పింఛన్‌దారులకు శుక్రవారం కొత్తపట్టిసీమ గ్రామ సచివాలయంలో పింఛన్‌లను పంపిణీ చేశారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, సర్పంచ్ మైగాపుల విజయదుర్గ లబ్ధిదారులకు పింఛన్‌లు అందజేశారు. ఉపసర్పంచ్ రంబ వాసు, మైగాపుల దుర్గాప్రసాద్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- ద్వారకాతిరుమలలో వైఎస్సార్ సీపీ మండల సమావేశం



పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగనన్న మరోసారి ముఖ్యమంత్రి కావాలని, వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అంతా కలసికట్టుగా పనిచేద్దామని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పిలుపునిచ్చారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో పార్టీ మండల నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సాయంత్రం సమావేశాన్ని నిర్వహించారు. అందులో ఎమ్మెల్యే తలారి, నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ)లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ పార్టీ నాయకులు, పార్టీలో ప్రతి కార్యకర్త సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. ఏవైనా చిన్నపాటి విభేదాలుంటే వాటిని పక్కనబెట్టి అంతా కలసిమెలసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు నేరుగా ప్రజల ఇంటి ముంగిటకు చేరుతున్నాయన్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలను నిర్మిస్తున్నట్టు చెప్పారు. వీటితో పాటు అమ్మఒడి, విద్యాదీవెన, మహిళలకు సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత వంటి ఎన్నో పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. వీటన్నిటిని విస్తృత ప్రచారం ద్వారా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అనంతరం జీవీ మాట్లాడుతూ కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నా.. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. టీడీపీ హయాంలో నిరుపేదలకు ఒక్క సంక్షేమ పథకం కూడా అందలేదని, కేవలం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే అందేవని తెలిపారు. ప్రస్తుత జగనన్న పాలనలో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, వైస్ ఎంపీపీ ఓగిరాల చంద్ర, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, ఉక్కుర్తి వెంకట్రావు, బొండాడ వెంకన్నబాబు, మానుకొండ సుబ్బారావు, సర్పంచ్‌లు కుంటం స్వర్ణలత, దాకారపు బంగారమ్మ, పసుపులేటి ఏసుబాబు, మానుకొండ ప్రసాద్, ఎంపీటీసీలు మానుకొండ కన్నయ్య, సున్న పద్మ, కొప్పిశెట్టి గంగ, బాలం వెంకటేశ్వరరావు, బుసనబోయిన వంశీ, మల్లెపూడి నాగమణి, పోలిన నారాయణరావు, ఆచంట బన్ను, నల్లంటి రామారావు, చెరుకూరి ప్రసాదరావు, గోపా నాగేశ్వరరావు, దిర్శిపాం అన్నవరం, నల్లూరి వెంకన్నబాబు, నల్లూరి బాపనయ్య తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ రాంబాబు నాయక్

చింతలపూడి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి సేవలు అందించాలని మండల పరిషత్ అధ్యక్షుడు డా బి.రాంబాబు నాయక్ ఆదేశించారు. మండలంలోని రేచర్ల వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల పట్ల గ్రామాల్లో ప్రజలకు అవగాహన కలిగించాలని అన్నారు. పరిసరాల శుభ్రతపై దృష్టి సారించాలని చెప్పారు. ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించాలని కోరారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- రాజుపోతేపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం



200వ రోజు 'గడపగడప'కు కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

టి.నరసాపురం: సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలుచేస్తూ నిరుపేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషిచేస్తున్నారని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని రాజుపోతేపల్లిలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రభుత్వం ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలు సంక్షేమ పథకాల అమలుకు ఎన్ని అడ్డంకులు కల్పించినా వాటన్నింటిని చేధిస్తూ రాజీ లేకుండా పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. పేదల అభ్యున్నతికి అడ్డుపడుతున్న టీడీపీకి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. అబద్ధపు హామీలతో మరోసారి మోసగించేందుకు సిద్ధపడుతున్న చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడంతో పాటు ఆ పార్టీని బంగాళాఖాతంలో కలిపేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనునిత్యం రైతు అభ్యున్నతికి కృషిచేయడంతో పాటు అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి తోడ్పడే విధంగా పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ సామంతపూడి బాలసూర్యనారాయణ రాజు, ఎంపీపీ దారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, కె.జగ్గవరం సహకార సంఘం ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి మధు, సర్పంచ్ బొంతు రమాదేవి అంజిబాబు, కేతవరం సర్పంచ్ తడికలపూడి శివమాధవి, ఎంపీటీసీలు బొడ్డపాటి రాంబాబు, బండి సుబ్బారావు, రైల్వే బోర్డు మెంబర్ వంటిపల్లి వెంకటేశ్వరరావు, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కన్నం సర్వేశ్వరరావు, పార్టీ నాయకులు దాసరి రాంబాబు, ఎం.అనిల్, బోళ్ల రంగారావు, నోముల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు 200వ రోజు పోస్టర్ ఆవిష్కరణ

పోలవరం నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొద్దిరోజుల్లో 200వ రోజుకు చేరుతున్న నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే బాలరాజు నాయకులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతోగానో దోహదపడుతుందన్నారు. జెడ్పీటీసీ సామంతపూడి బాలసూర్యనారాయణ రాజు, ఎంపీపీ దారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, కె.జగ్గవరం సహకార సంఘం ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి మధు, సర్పంచ్ బొంతు రమాదేవి అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రూ.60 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం



ఎమ్మెల్యే ఎలీజాను కలిసిన వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

కామవరపుకోట: మండలంలో రూ.60 లక్షలతో సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్లు, అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఎలీజా శ్రీకారం చుట్టారు. తడికలపూడి ఎస్సీ ఏరియాలో రూ.10 లక్షలతో సీసీ డ్రెయిన్, వీరిశెట్టిగూడెం గ్రామంలో జగనన్న కాలనీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, రామన్నపాలెంలో గోపన్న కాలనీలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, కామవరపుకోట యానాదుల కాలనీలో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు, కామవరపుకోట మోడల్ డిగ్రీ కళాశాల సమీపంలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంజూరు కోరుతూ ఎమ్మెల్యే ఎలీజా ప్రతిపాదనలు పంపి త్వరలో నిర్మాణాల పనులు చేపడతామని తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు జంగారెడ్డిగూడెం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎలీజాను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ పందు జగదీష్, వీరిశెట్టిగూడెం, రామన్నపాలెం, సాగిపాడు సర్పంచ్‌లు దేవరపల్లి రామ్మోహన్‌రావు, తులసి సత్యనారాయణ, గుండుగొలను సుబ్బారావు, నల్లూరి ప్రభాకర్‌రావు, వెర్రు శీను, పాల వెంకటేశ్వరరావు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.

చంద్రబాబు అవినీతిపై నోరు మెదపరేం


వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ పరిశీలకులు జీవీ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జీవీ, ఎమ్మెల్యే తలారి తదితరులు

ద్వారకాతిరుమల: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడికి ఆదాయపు పన్ను శాఖ ఇచ్చిన షోకాజ్ నోటీసులపై ఆయన పుత్రుడు లోకేశ్ గానీ, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ గానీ నోరు మెదపకపోవడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) ఎద్దేవా చేశారు. ద్వారకాతిరుమలలోని కాపు కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన పార్టీ మండల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జీవీ, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావుతో కలసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు రూ.118 కోట్ల ప్రజాధనాన్ని నేరుగా నొక్కేసినట్టు ఆధారాలతో సహా బట్టబయలైందన్నారు. 2019లో అమరావతిలో రూ.7 వేల కోట్ల విలువైన రాజధాని భవన నిర్మాణ పనులను షాపూర్జీ పల్లోంజీ కంపెనీకి ఫర్ ఎస్ఎఫ్‌టీని 19 వందల నుంచి 2 వేలకు చంద్రబాబు ఇచ్చారు. ఇలా ఇచ్చిన సొమ్ములో 118 కోట్లను ముడుపులుగా చంద్రబాబు ఆ కంపెనీ నుంచి నేరుగా అందుకున్నట్టు సాక్ష్యాధారాలతో సహా రుజువైందన్నారు. దీనిపై గత వారం రోజులుగా రాద్ధాంతం జరుగుతున్నా చంద్రబాబు, యువగళం పేరుతో వాకింగ్ యాత్ర చేస్తున్న లోకేశ్, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్, పచ్చపత్రికలు స్పందించక పోవడం దారుణమన్నారు. అందరికీ ముడుపులు అందడం వల్లే అంతా తేలుకుట్టిన దొంగల్లా ఉండిపోయారని విమర్శించారు. చంద్రబాబుకు షోకాజ్ నోటీసులు ఇచ్చింది రాష్ట్ర ప్రభుత్వ ఏజన్సీ కాదని, కేంద్ర ప్రభుత్వ ఏజన్సీ అని ఆయన అన్నారు. పేదలకు మేలు చేసే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై అనుక్షణం బురదచిమ్మే వారంతా, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడడం లేదని ఆయన ప్రశ్నించారు. 2012 అక్టోబర్ నుంచి, 2023 జూన్ వరకు చంద్రబాబుకు ఐటీశాఖ నాలుగు సార్లు సమన్లు ఇచ్చిందని, వాటికి చంద్రబాబు ఇచ్చిన వివరణ పొంతన లేకుండా ఉన్నట్టు ఆశాఖ తేల్చిందన్నారు. డైరెక్టుగా రూ.118 కోట్లు చంద్రబాబుకు అందినవేనని నిర్ధారించిన తరువాతే ఆయనకు షోకాజ్ నోటీసులు అందించారన్నారు. ఇంత రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయినా ఏమాత్రం సిగ్గు లేకుండా చంద్రబాబు ప్రజల్లో తిరుగుతున్నారని ధ్వజమెత్తారు. అలాగే యువగళం పేరుతో వాకింగ్ యాత్ర చేస్తున్న లోకేశ్, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ నిమ్మకుండిపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అమరావతి ఒక ల్యాండ్ పూలింగ్ స్కామ్ అని, కొన్ని వేల కోట్ల ప్రజాధనాన్ని బాబు దుర్వినియోగం చేశారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ విషయాన్ని ముందే గమనించారని, అందుకే రివర్స్ టెండరింగ్ ద్వారా ఎస్ఎఫ్‌టీని రూ. 13 వందలకు ఇచ్చారన్నారు. వీటిని ప్రజలు గమనించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, మండల యూత్ ప్రెసిడెంట్ పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ భోగరాజు సాయి కృష్ణ, చెలికాని బుల్లియ్య, దాకారపు బంగారమ్మ, అగ్గియ్య, దిర్శిపాం అన్నవరం, కొండాబత్తుల గిరి, బొండాడ వెంకన్నబాబు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్ తదితరులున్నారు.

శక్తిస్వరూపిణీ.. నమోస్తుతే



స్వర్ణకవచ అలంకరణలో విజయదుర్గమ్మ



విశేషాలంకరణలో ముత్యాలమ్మ



టి.నరసాపురంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: శ్రావణమాసం శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఆయా ఆలయాల్లో అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. పట్టణంలోని విజయదుర్గమ్మను స్వర్ణకవచాలు, లక్ష పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ అధ్వర్యంలో సుదర్శనం వేణుగోపాలచార్యులు అమ్మవారికి పూజలు జరిపారు. సాయంత్రం 6 గంటలకు 108 మంది మహిళలచే 108 హారతులు, అలాగే అమ్మవారిని పురవీధులలో పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు పసుమర్తి గుప్త, ఆకాశపు పుష్పవతి ప్రసాద వితరణ చేసినట్లు ఆలయ ప్రధాన కార్యదర్శి మాడ రామమోహన్‌రావు తెలిపారు. నూతన మున్సిపల్ కార్యాలయం వద్ద వేంచేసి ఉన్న శ్రీ చక్ర సహిత ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ పద్మకుమారి దంపతుల పర్యవేక్షణలో, ప్రధాన అర్చకులు మిర్తిపాటి విశ్వనాథ శ్రీనివాస శర్మ, ఆర్య వైశ్య అర్చకులు బొడ్డు సత్యనారాయణ గుప్తా నిత్యపూజలతో పాటు ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామ దేవత గంగానమ్మను దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. అమ్మవారికి గద్దే విజయలక్ష్మి, కుమారుడు ఫణీంద్ర రూ.40 వేలు విలువ చేసే వెండి ప్లేట్లు, 4 కప్పులు బహూకరించారు. భక్తులకు పాలడుగుల హర్షవర్ధన్, తేజస్విని దంపతులు అన్నప్రసాత వితరణ చేశారు. వివిధ రకాల పండ్లతో నూకాలమ్మ తల్లిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కల్యాణ కళా వేదిక వద్ద ముత్తయిదువులచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

పారిజాతగిరిలో...

పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఉదయం స్వామి వారి ధ్రువమూర్తికి పంచామృతాభిషేకం నిర్వహించి, విశేష అలంకరణ చేశారు. ఉదయం 10 గంటల నుంచి ఆలయ కల్యాణ వేదిక వద్ద సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఆలయ ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.

టి.నరసాపురం: టి.నరసాపురంలోని అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో సామూహిక వరలక్ష్మివ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశాలాక్షి అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

వికాస్ విద్యాసంస్థల డైరెక్టర్ అరెస్ట్

జంగారెడ్డిగూడెం: స్థానిక వికాస్ విద్యాసంస్థల డైరెక్టర్ ఊరకర్నం జగన్నాధరావును అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు. వివరాల ప్రకారం స్థానిక కాలేజ్ రోడ్డులో కొనకళ్ల నాగేశ్వరరావు గుప్తాకు చెందిన ఒక భవనాన్ని జగన్నాధరావు పాఠశాల నిర్వహణ కోసం అద్దెకు తీసుకున్నారు. అయితే అద్దె సక్రమంగా ఇవ్వకపోవడమే కాక, భవనాన్ని ఖాళీచేయమంటే ఖాళీ చేయడం లేదని, ఈ నేపథ్యంలో జగన్నాధరావు, మరో ఇద్దరు జూన్ నెలలో తన భవనం కిటికీలో నుంచి పెట్రోల్ పోసి దగ్ధం చేసే ప్రయత్నం చేశారని నాగేశ్వరరావు గుప్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడైన జగన్నాధరావును శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై చెప్పారు.

వ్యక్తిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఒక వ్యక్తి మరో వ్యక్తిపై దాడి చేసిన కొట్టిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. వివరాల ప్రకారం స్థానిక పంగిడిగూడెం రోడ్డులో నివసిస్తున్న పంతగాని నాగేశ్వరరావుకు పంతగాని మోహన్‌కు సరిహద్దు తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నాగేశ్వరరావు కంచె కట్టుకుంటున్న సందర్భంలో మోహన్, మరో ఇద్దరు కలిసి అతనిపై దాడి చేసి కొట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై చెప్పారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్ట్

జంగారెడ్డిగూడెం: హత్యాయత్నం కేసుకు సంబంధించి ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. పట్టెన్నపాలెంలో గొర్రె శ్రీనివాసరావుకు జి.బలరామ్‌లకు మధ్య భూ వివాదం ఉంది. ఈ వివాదం నేపథ్యంలో బలరామ్ దాడిచేయడంతో శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ కేసుకు సంబంధించి జి.బలరామ్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై చెప్పారు.

అశ్లీల నృత్య ప్రదర్శనలపై..

ద్వారకాతిరుమల: అశ్లీల నృత్య ప్రదర్శనలు జరుపుతున్న ఐదుగురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. వివరాలు ప్రకారం. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గురువారం రాత్రి జాజులకుంట గ్రామంలోని రామాలయం వద్ద అశ్లీల నృత్య ప్రదర్శనలు జరుపుతున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై సుధీర్, సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి వెళ్లగా పరారయ్యేందుకు ప్రయత్నించిన పాముల ధర్మరాజు, గంగుల నాగేంద్ర, ఆళ్ల గంగాధరరావు, ఆళ్ల ఆంజనేయులు, ముమ్మిడి వెంకటేశ్వరరావులను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వివాహిత అదృశ్యంపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం స్థానిక పాపారాయుడు సెంటర్‌లో నివసిస్తున్న పైడా నవీన్ ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్నాడు. ఈనెల 7వ తేదీన విధులు పూర్తిచేసుకుని ఇంటికి వెళ్లేసరికి తన భార్య దుర్గాదేవి కనిపించలేదు. బంధువులు, స్నేహితుల ఇంటి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం-జంగారెడ్డిగూడెం రోడ్డు పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పనులు గతంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రారంభించారు. అయితే సాంకేతిక కారణాల వల్ల పనులు నిలిచిపోయాయి. మళ్లీ పనుల తిరిగి ప్రారంభించేందుకు ఎమ్మెల్యే బాలరాజు కృషి చేశారు. పనుల ప్రారంభంతో రహదారి కష్టాలు తీరనున్నాయి. ఈ పనులను ఉదయం వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, సర్పంచ్‌లు తెల్లం వెంకాయమ్మ, మండకం రామలక్ష్మీ, ఎంపీటీసీ తెల్లం రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు తెల్లం దేవరాజు తదితరులు పరిశీలించారు. ఇదిలా ఉండగా సాయంత్రం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పనుల్లో లోపాలు జరుగకుండా నాణ్యతతో పూర్తి చేయాలన్నారు.

నేడు పలు భవన నిర్మాణాలకు శంకుస్థాపన

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రంలో శనివారం పలు భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా శంకుస్థాపన చేస్తారని ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు క్షేత్రంలో శ్రీరామ సదనం వసతి సముదాయం భవన నిర్మాణంతోపాటు పలు భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమి పూజ చేస్తారన్నారు.

ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలపాలి

టి.నరసాపురం: రాజకీయ పార్టీలు ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలపాలని ఎంఆర్‌పీఎస్ పోలవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ లంకా జయబాబు మాదిగ కోరారు. రాజుపోతేపల్లి గ్రామంలో శుక్రవారం గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజును కలిసి జయబాబు వినతిపత్రం అందజేశారు. రానున్న పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టేలా కేంద్రం పై ఒత్తిడి తేవాలని ఆయన కోరారు.

నిర్వాసితులకు ఇళ్లస్థలాల పొజిషన్ చూపించిన అధికారులు

పోలవరం రూరల్: గిరిజనేతర నిర్వాసితులకు కేటాయించిన ఇళ్లస్థలాలను నిర్వాసితులకు పొజిషన్ చూపించారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల మొదటి విడత ఖాళీ చేసిన కొరుటూరు, తూటికుంట, కొండ్రుకోట పంచాయతీ పరిధిలోని 140 మంది గిరిజనేతరులకు గతంలో ఇళ్ల పట్టాలు అందించారు. వీరికి జంగారెడ్డిగూడెం మండలం చల్లవారిగూడెంలో ఇళ్లస్థలాలు కేటాయించి పట్టాలు ఇచ్చారు. అయితే అప్పట్లో ఆ స్థలాన్ని నిర్వాసితులకు అందజేయకపోవడంతో, శుక్రవారం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, తహసీల్దార్ బి.సుమతి వారికి పొజిషన్ చూపిస్తూ సర్టిఫికెట్ అందజేశారు.